ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు

ఆదివారం 11 మే 2025

ప్రజారోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ

జియ్యమ్మవలస, మే10(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ప్రజారోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు ఆదేశించారు. శనివారం సుందరాపురంలో వైద్య సిబ్బంది సర్వే, ప్రజల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించారు. వ్యాక్సిన్ వీవీఎంతో పాటు యూవిన్ ఆన్‌లైన్ నమోదు, ఎంసీపీ కార్డుల్లో వైద్య పరీక్షల వివరాలు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువును గమనించారు. బరువు తక్కువగా ఉన్నవారిపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో వైద్య సిబ్బంది వి.శారద, రమేష్, జానకి, తదితరులు ఉన్నారు.

ఆ కష్టాలు తొలగేనా?

- శిథిల పాఠశాలలపై ప్రభుత్వం దృష్టి
- భవన నిర్మాణాలకు నిధులు మంజూరు
- తొలివిడతగా 23 బడుల్లో పనులు
- గతంలో బిక్కుబిక్కుమంటూ చదువులు
- దృష్టి సారించని వైసీపీ సర్కారు




శిథిలావస్థలో కారివలస పాఠశాల

గరుగుబిల్లి, మే 10(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ పాఠశాలలకు మోక్షం కలగనుంది. భవన నిర్మాణాలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. త్వరలో పనులు జరగనున్నాయి. దీంతో విద్యార్థులకు కష్టాలు తప్పనున్నాయి. చెట్ల కింద చదువులకు ఇక స్వస్తి పలకనున్నారు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం శిథిల పాఠశాలల వైపు దృష్టి సారించలేదు. కనీసం మరమ్మతు చర్యలు కూడా చేపట్టలేదు. నిబంధనల నెపంతో నిధుల మంజూరులో తీవ్ర జాప్యం చేసింది. మరోవైపు శిథిల భవనాలు ఎప్పుడు కూలుతాయో తెలియక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర భయాందోళన చెందేవారు. వర్షాలు కురిసే సమయంలో అయితే వేరే ప్రాంతాల్లో బడులు నిర్వహించేవారు. చాలా పాఠశాలల్లో వసతి సమస్య నెలకొనడంతో చాలా చోట్ల ఆరుబయట చెట్ల కిందే బోధించేవారు.

అయితే ఈ సమస్యలను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సీమలవానివలసలో పాఠశాల భవనం ఇలా..

నిర్మాణాలు ఇలా..

- జిల్లా అధికారుల నివేదికల ఆధారంగా 'మన్యం'లో 40 పాఠశాలల నిర్మాణాలకు రూ. 5.40 కోట్లు మంజూరయ్యాయి. జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ నిధులు రూ.13.50 లక్షలతో ఒక్కో పాఠశాల భవనాన్ని నిర్మించనున్నారు. అయితే అడ్వాన్స్‌గా రూ. 2 కోట్లు విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.
- సీతంపేట, భామిని, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, గరుగుబిల్లి, పార్వతీపురం, మక్కువ, సాలూరు, పాచిపెంట మండలాల్లోని పాఠశాలలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చారు.
- విద్యార్థుల సంఖ్యను బట్టి నిబంధనల మేరకు ప్రస్తుతం 23 పాఠశాలల్లో పనుల చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. రెండో విడతలో మరో 17 పాఠశాలల్లో అవసరాలను గుర్తించి నిర్మాణాలు చేపట్టనున్నారు.

అవసరమైన పాఠశాలలకు నిధుల మళ్లింపు..

- జిల్లాలో కొన్ని పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరకుండానే నిధులు మంజూరయ్యాయి. అయితే వాటి స్థానంలో శిథిలావస్థకు చేరుకున్న వేరే పాఠశాలలకు నిధులు మళ్లించి పనులు చేపట్టనున్నారు.
- గరుగుబిల్లి మండలం సుంకి పాఠశాల భవనం ఉపయోగకరంగా ఉండగా.. దాని స్థానంలో చిలకాం పంచాయతీ కారివలసకు, సీతారాంపురం బదులు శివ్వాం పంచాయతీ సీమలవానివలస పాఠశాలకు నిధులు మళ్లించారు. కొద్ది రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి.

ఎలిమెంటరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా భవనాలు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు.

- సీతంపేట మండలం వెదుర్లవలసకు బదులుగా సీతంపేట జీపీఎస్‌కు, కొమరాడ మండలం కూనేరు స్థానంలో ఈదులవలసకు, కంబవలసకు బదులుగా రావికోనవలసకు, గుమ్మలక్ష్మీపురం మండలం పుట్టగూడ స్థానంలో ఎల్విన్‌పేటకు, గడ్డికాలనీకి బదులు ఎల్విన్‌పేటకు, కురుపాం మండలం మంటికొండకు బదులు బల్లకోటకు, కేసలి స్థానంలో లంకాజోడు, పార్వతీపురం మండలం గంగాపురానికి బదులుగా చందలంగి పాఠశాల భవన నిర్మాణాలకు నిధులు మళ్లించారు.
- పాచిపెంట మండలంలో చెరుకుపల్లి, పనుకువలస, సీతంపేట, కూనబందవలస, తోటవలస పరిధిలో భవనాలు అవసరం లేదని నివేదికలు అందించారు. ఈ ఐదు పాఠశాలల నిధులను ఇంకా మళ్లించలేదు. దీనిపై కలెక్టర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- మొత్తంగా పది పాఠశాలలకు నిధులు మంజూరైనా భవన నిర్మాణాలు అవసరం లేకపోవడంతో వాటి స్థానంలో మరో పది పాఠశాలలను ఎంపిక చేశారు. వాటికి కలెక్టర్ నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

అనుమతులు రాగానే పనులు..

కలెక్టర్ నుంచి అనుమతులు రాగానే భవన నిర్మాణాలు ప్రారంభమవుతాయి. మొదటిగా 23 పాఠశాలల్లో పనులు నిర్వహించనున్నాం. వాటికి సంబంధించి రూ. 2.08 కోట్లు అందించనున్నాం. మరో 17 పాఠశాలల్లో అవసరాలను గుర్తించి నిధులు కేటాయించనున్నాం. పాఠశాల భవనాల శిథిలావస్థతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టనున్నాం.

-రెడ్డి తేజేశ్వరరావు, అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, జిల్లా సమగ్ర శిక్ష

సేకరిస్తే ఆదాయమే!

- తునికాకు సేకరణతో గిరిజనులకు ఉపాధి
- అటవీశాఖకూ లాభమే..
- వైసీపీ పాలనలో నిలిచిన వైనం
- రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని విన్నపం

గుమ్మలక్ష్మీపురం, మే10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తునికాకు (బీడీ ఆకు)కు ఎంతో గిరాకీ ఉంది. వరంగల్ తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి రవాణా అయ్యేది. అక్కడి నుంచి ఛత్తీస్‌గఢ్‌కు ఎగుమతి చేసేవారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది వ్యాపారులు ఇక్కడకు వచ్చి వాటిని కొనుగోలు చేసేవారు. తద్వారా అటవీశాఖకు ఆదాయం వచ్చేది. మరోవైపు ఏటా వేసవిలో గిరిజనులు కూడా వాటిని సేకరించి ఉపాధి పొందేవారు. గతంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, మక్కువ, పాచిపెంట, సాలూరు తదితర గిరిజన మండలాల్లో వాటి సేకరణ జరిగేది. గిరిజనులకు రోజుకు రూ.300 వరకు కూలి వచ్చేది. కుటుంబంలో ఇద్దరు కష్టపడితే రూ.600 వరకు వచ్చేది.



వంజరాపుగూడలో తునికాకు

గతంలో ఇలా..

అటవీశాఖ ఏటా వేసవిలో తునికాకు సేకరణకు టెండర్లు పిలిచేది. ఈ టెండర్ పొందిన వారు గిరిజనులకు సేకరణ పనులు అప్పగించేవారు. దీంతో వారు ఉదయాన్నే బీడీ ఆకును సేకరించి ఇంటికి తీసుకొచ్చేవారు. మధ్యాహ్నం వేళ 50 ఆకుల చొప్పున కట్టలు కట్టి కల్లాలకు తీసుకెళ్లి వ్యాపారులకు విక్రయించేవారు. టెండర్లు దక్కించుకున్న వారు ప్రతి గ్రామంలో కల్లాలు ఏర్పాటు చేసి వాటిని ఆరబెట్టేవారు. ఇందుకు గాను గిరిజన యువతకు ప్రతినెలా రూ.3వేలు ఇచ్చేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. బీడీ ఆకు సేకరణ నిలిచిపోయింది. దీంతో గిరిజన కూలీలు ఆదాయం కోల్పోయారు.

ఇదే అనువైన సమయం..

వాస్తవంగా మే, జూన్, జూలై నెలల్లో తునికాకు సేకరణకు అనువుగా ఉంటుంది. సకాలంలో ఆకు సేకరిస్తే అటవీశాఖకు సుమారు రూ.కోటి వరకు ఆదాయం రానుంది. గిరిజనులకు రోజుకు రూ. 500 కూలి వచ్చే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి.. అటవీశాఖ ద్వారా బీడీ ఆకు సేకరణ చేపట్టాలని గిరిజన కూలీలు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. దీనిపై ఫారెస్ట్ రేంజర్ గంగరాజును వివరణ కోరగా.. 'ఇప్పటివరకు కురుపాం రేంజ్ పరిధిలో తునికాకు కొనుగోలుకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు వస్తే తగిన చర్యలు తీసుకుంటాం.' అని తెలిపారు.

సాగునీటి ఇక్కట్లు తీరేనా?

- అధ్వానంగా తోటపల్లి కాలువలు
- బలహీనంగా గట్లు .. శిథిలావస్థలో షట్టర్లు

వీరఘట్టం, మే10 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మండల పరిధిలో తోటపల్లి కాలువలు పిచ్చిమొక్కలతో నిండి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. మరోవైపు కాలువ గట్లు కూడా పూర్తిగా బలహీనపడ్డాయి. షట్టర్లు శిథిలావస్థకు చేరడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో మండలంలో శివారు భూములకు ఏటా సాగునీరు అందడం లేదు. ఖరీఫ్, రబీ సీజన్లలో వరుణుడిపైనే ఆధారపడి పంటలు పండించుకోవాల్సి వస్తోంది.



పిచ్చిమొక్కలతో నిండిన కాలువ



నడిమికెల్ల వద్ద శిథిలావస్థకు చేరిన షట్టర్

వాస్తవంగా గరుగుబిల్లి మండలం తురకనాయుడువలస వద్ద మొదటి బ్రాంచి నుంచి వీరఘట్టం మండల పరిధిలో కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామాల్లో సుమారు పది వేల ఎకరాలకు తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. అయితే నడిమికెల్ల, విక్రంపురంలో షట్టర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఆయా ప్రాంతాల్లో బ్రిటిష్ కాలం నాటి కాలువలు, గట్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో శివారున ఉన్న సుమారు 1500 ఎకరాలకు పూర్తిగా నీరందడం లేదు. ఏటాలానే ఈ ఖరీఫ్‌కు కూడా ఇక్కట్లు తప్పేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై నీటిపారుదల శాఖ ఏడీ డీవీ రమణను వివరణ కోరగా.. కాలువ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని తెలిపారు.



బలహీన పడిన కాలువ గట్టు

మ్యారేజ్ సర్టిఫికెట్ ఇవ్వట్లే!

- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న నూతన దంపతులు

శ్యామలాంబ పండగను వైభవంగా నిర్వహించాలి

- మంత్రి సంధ్యారాణి

'తోటపల్లి'కి దాతలే దిక్కు

- దేవస్థానం అభివృద్ధిపై దృష్టి సారించని దేవదాయశాఖ



6లో

రేపు పైడిమాంబ దేవర ఉత్సవం



విజయనగరం రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ దేవర ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 12న ఉత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో 12, 13 తేదీల్లో పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. దేవర ఉత్సవం రోజునే విజయనగరానికి చెందిన భక్తులు అధికంగా ముగ్రాటలు సమర్పిస్తారు. ఈవో, ఉద్యోగులు, అర్చకులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు పూర్తిచేశారు. ఏటా అక్టోబరులో దసరా అనంతరం వచ్చే మంగళవారం పైడిమాంబ సిరిమానోత్సవం జరుగుతుంది. దీనికి నాందిగా భావించేదే దేవర ఉత్సవం. వనంగుడి నుంచి పైడిమాంబను మూడు లాంతర్లు వద్దనున్న చదురుగుడికి తీసుకురావడమే దేవర ఉత్సవ ఉద్దేశం. ఊరేగింపు ప్రక్రియ రాత్రి 12 గంటల వరకూ కొనసాగుతుంది. తిరిగి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు అర్చకులు, సిబ్బంది, పైడిమాంబ భక్తులు ఊరేగింపుగా చదురుగుడికి రానున్నారు.

ధర్మకర్తల మండలికి గ్రీన్‌సిగ్నల్

ప్రభుత్వం ఆదేశాల ప్రకారం.. పైడిమాంబ దేవస్థానానికి ధర్మకర్తల మండలి నియామకం చేపట్టనున్నారు. వంశపారంపర్య ధర్మకర్త చైర్మన్‌గా ఉంటారు. ఈ నేపథ్యంలో చైర్మన్‌గా అశోక్ గజపతిరాజు, ఆలయ ఏసీ కూడా కమిటీలో ఉంటారు. వీరు కాకుండా ఇద్దరు అర్చకులు, తొమ్మిది మంది సభ్యులకు ధర్మకర్తలమండలిలో చోటు ఉంటుంది. పైడిమాంబ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం జూన్ తొలి వారంలో జరగనుంది.

ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్త

- మంత్రి శ్రీనివాస్
- కొట్టక్కిలో ఎంఎస్‌ఎంఈ పార్కుకు శంకుస్థాపన

రామభద్రపురం, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు చేయాలన్నదే కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కొట్టక్కి గ్రామం వద్ద రూ.7కోట్లతో మంజూరైన ఎంఎస్‌ఎంఈ పార్కుకు సంబంధించి శిలాఫలకాన్ని శనివారం ఆవిష్కరించారు. రూ.లక్ష నుంచి రూ.50 కోట్ల పెట్టుబడితో పరిశ్రమల స్థాపనకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో 24 గంటల విద్యుత్, రోడ్ల సౌకర్యం, తాగునీటి సౌకర్యంతోపాటు ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.




శిలాఫలకం వద్ద మంత్రి శ్రీనివాస్, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తదితరులు

రెచ్చగొట్టే వ్యాఖ్యలు వద్దు

- బాధ్యతతో మెలగాలి
- ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, మే 10(ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ప్రతిఒక్కరూ బాధ్యతతో మెలగాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి సూచించారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించినా.. వ్యాఖ్యలు చేసినా సహించేది లేదన్నారు. ప్రతి పౌరుడు సైనికులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. శనివారం తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతున్న నేపథ్యంలో త్రివిధ దళాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందరూ సహకరించాలన్నారు. ప్రతి పౌరుడు ఒక సైనికుడిలా మారాలని తెలిపారు. జిల్లాలో ధర్నాలు, ర్యాలీలు, ఆందోళనలకు అనుమతుల్లేవని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో దేశం, మతం తదితర అంశాలపై అనధికార సందేశాలను ఫార్వర్డ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాస్తవాలు తెలుసుకోకుండా వివాదాస్పద విషయాలు, ఫేక్ న్యూస్ వ్యాప్తి చేయడం సరికాదన్నారు. అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టడం, ప్రోత్సహించడం, సహకరించడం చట్టరీత్యా నేరమని వెల్లడించారు. సోషల్ మీడియాపై సైబర్ సెల్ పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు.



కదలవు.. వదలవు..

- రెండు గ్రామాల మధ్య గజరాజుల సంచారం

గరుగుబిల్లి, మే10(ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలం నుంచి గజరాజులు కదలడం లేదు. గత ఐదు రోజులుగా ఈ ప్రాంతంలో హల్‌చల్ చేసిన ఏనుగులు శనివారం తోటపల్లి-నందివానివలస మధ్య సంచరించాయి. దీంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మరోవైపు గజరాజుల కారణంగా పంటలను నష్టపోయిన రైతులు లబోదిబోమంటున్నారు. నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి తక్షణమే వాటిని ఈ ప్రాంతం నుంచి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.



తోటపల్లి - నందివానివలస మధ్యలో సంచరిస్తున్న ఏనుగులు

తోటపల్లికి దాతలే దిక్కు

- దేవస్థానం అభివృద్ధిపై దృష్టి సారించని దేవదాయశాఖ
- దాతల సహకారంతోనే పునర్నిర్మాణ పనులు
- ఇన్‌చార్జి ఈవోతోనే పాలన
- ఆదాయం తక్కువ, సిబ్బంది ఎక్కువ
- వేధిస్తున్న అర్చకుల కొరత

గరుగుబిల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల అభివృద్ధి దాతలు సహకారంతోనే జరుగుతుంది. గుర్తింపు పొందిన దేవస్థానాలు అయినప్పటికీ అభివృద్ధికి దేవదాయ, ధర్మాదాయశాఖ చొరవ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. దేవస్థానానికి అంతంత మాత్రంగానే ఆదాయం లభిస్తుంది. భక్తుల నుంచి కానుకల రూపంలో వచ్చే మొత్తాల్లో కొంత సిబ్బంది జీతాలు, దూప దీప నైవేద్యం, భోగం వంటి వాటికి వెచ్చిస్తున్నారు. గతంలో దేవస్థాన సముదాయం చిన్న పాటిది కావడంతో సిబ్బంది సర్దుకుపోయేవారు. ప్రస్తుతం నూతనంగా నిర్మాణం చేపట్టిన ఆలయాలు అధికం కావడంతో సిబ్బంది కొరత నెలకొంది. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వేతనాలు అందించడంలో కొంత మేర జాప్యం జరుగుతుంది.

ఆలయ నేపథ్యం..

వెంకటేశ్వరస్వామి విగ్రహం తోటపల్లి సమీపంలోని పుట్టలో దర్శనమిచ్చింది. 1968 ఫిబ్రవరి 26న పుట్టలోని విగ్ర హాన్ని స్థానికులు బయటకు తీసి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. తదుపరి దేవాలయం నిర్మాణానికి 1968లో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. వీరఘట్టానికి చెందిన వైద్యులు దివంగత నల్లాన సాంబశివరావు వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడిగా, కార్యదర్శిగా మోణంగి లక్ష్మణరావు, కోశాధికారి, కార్యదర్శిగా తోటపల్లికి చెందిన మార్కొండ అప్పలస్వామినా యుడు వ్యవహరించారు. దేవాలయ నిర్మాణంతో పాటు నిర్వహణకు అవసరమైన భూసేకరణ చేశారు. పరిసర గ్రామాలకు చెందిన పలువురి నుంచి సుమారు 12.34 ఎకరాలను సేకరించారు. 1972 జనవరి 26న ఆలయాన్ని ప్రారంభించారు. భూమి నుంచి వచ్చే ఆదాయంతో స్వామివారికి దూప, దీప, నైవేద్యాలను నిర్వహించారు. 1980-81 నుంచి దేవదాయశాఖ అధీనంలోకి తోటపల్లి వెళ్లింది.



స్వామివారి విగ్రహం

ఇన్‌చార్జితోనే పాలన

తోటపల్లి దేవస్థానానికి పూర్తిస్థాయి ఈవో లేరు. పాలకొండ కోటదుర్గ దేవస్థానం ఈవో వీవీ సూర్యనారా యణను తోటపల్లి, శంబర ఆలయాలకు ఇన్‌చార్జిగా నియమిం చారు. కోటదుర్గ దేవస్థానం పరిధిలో ఐదు ఉప ఆలయాలు, శంబర పరిధిలో రెండు గ్రూపు దేవాలయాలు ఉన్నాయి. ఈ ఆలయాల బాధ్యతలన్నీ ఆయనే చూడాలి. ప్రధానంగా కోటదుర్గ, తోటపల్లి, శంబర ఆలయాలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ మూడు దేవాలయాల పర్యవేక్షణకు ఒకరే అధికారి కావడంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పర్యవేక్షణ లోపం కారణంగా సమస్యలు నెలకొంటున్నాయి. అదే విధంగా తోటపల్లి దేవస్థానంలో గత పదేళ్లుగా అర్చకుల కొరత వేధిస్తోంది. ప్రధాన ఆలయాలకు సంబంధించి ముగ్గురు అర్చకులు ఉండాల్సి ఉన్నా ప్రస్తుతం ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు. వీరికి వేరే వారు సహాయకులుగా ఉంటున్నారు. భక్తులకు ప్రసాదం అందించేందుకు, వాటిని తయారీ చేసేందుకు వంటస్వామి లేని పరిస్థితి నెలకొంది. పూర్తిస్థాయిలో అర్చకులను నియమించాలని భక్తులు కోరుతున్నారు.



గత ఆలయం

దేవదాయశాఖ శీతకన్ను

తోటపల్లి దేవస్థానంపై దేవదాయశాఖ శీతకన్ను వేసింది. అభివృద్ధిపై దృష్టి సారించలేదు. దాతల సహకారంతోనే కార్యక్రమాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. 1972లో నిర్మాణం చేపట్టిన వసతి గదులు, బాలాజీ కాంప్లెక్స్, ప్రధాన కార్యాలయం, వంటశాలతో పాటు పలు భవనాలు శిథిలం కావడంతో పూర్తిస్థాయిలో వాటిని తొలగించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దేవస్థానం అభివృద్ధికి సీజీఎఫ్ నిధులు రూ.82 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆలయ పునఃనిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. పూర్తిస్థాయి పనులకు నిధులు కేటాయించకపోవడంతో 2023 జనవరి 12న తోటపల్లి టెంపుల్స్ డెవలప్‌మెంట్ సేవా ట్రస్ట్‌ను రిజిస్ట్రేషన్ చేయించారు. పలువురి దాతలను సంప్రదించి విరాళాలను సేకరించారు. పూర్తిస్థాయిలో నిర్మాణాలకు సుమారు రూ.7 కోట్లు వ్యయంతో ముందుకు వచ్చారు. సభ్యత్వాలు, విరాళాలతో పాటు రుణాలు, తదితర మొత్తాలు రూ.1,98,64,916 ఖర్చు చేశారు. 2025 ఫిబ్రవరి 7న విగ్రహాల పునఃప్రతిష్ఠ నిర్వహించారు. ప్రధాన ఆలయాలతో పాటు ఉప ఆలయాలు ఏర్పాటు చేయడంతో ప్రత్యేక ఆకర్షణగా తోటపల్లి నిలిచింది. అలాగే, రూ.2.32 కోట్లుతో ప్రాకార మండపం, రూ.80 లక్షలతో రాజ గోపురం, పుట్టు దేవునికి వాన ప్రస్థాశ్రమం నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడుతున్నారు. సాక్షి వినాయక, ఆంజనేయ, సరస్వతిదేవి ఆలయాల నిర్మాణానికి సుమారు రూ.1.20 కోట్లు వ్యయం చేశారు. నిధుల సమస్య కారణంగా పనులు ముందుకు సాగడం లేదు.



నూతనంగా నిర్మించిన తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం





ప్రత్యేక ఆకర్షణగా ఉప ఆలయాలు

ఆదాయం తగ్గింది

తోటపల్లి దేవస్థానానికి ఆదాయం తగ్గింది. గతంలో వసతి గదులతో పాటు పలు సౌకర్యాలు ఉండేవి. అవి శిథిలం కావడంతో తొలగించాం. ప్రస్తుతం నూతన ఆలయాల నిర్మాణం చేపట్టడంతో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఆలయాల పరిధిలో గతంలో కంటే ప్రస్తుతం పలు నిర్మాణాలు చేపట్టడంతో నిర్వహణ కష్టతరంగా ఉంది. ఆదాయం తక్కువ, నిర్వహణ ఖర్చు ఎక్కువగా పరిస్థితి ఉంది. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. పూర్తిస్థాయిలో దేవస్థానం అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాం. తోటపల్లి ఆలయాల అభివృద్ధి సేవా ట్రస్ట్, దేవదాయశాఖ సమన్వ యంతో అవసరమైన అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నాం.

-వీవీ సూర్యనారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి, తోటపల్లి దేవస్థానం

పశువుల ఆకలి తీర్చేందుకు..

- 50 శాతం సబ్సిడీతో దాణా పంపిణీ
- ప్రభుత్వ నిర్ణయంపై రైతుల ఆనందం
- తొలివిడత జిల్లాకు 250 మెట్రిక్ టన్నులు



విజయనగరం రింగురోడ్డు, మే 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పశుగ్రాసం దొరక్క పశువులు ఆకలితో అలమటిస్తున్నాయి. వాటి మేత కోసం పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి ఊరట కలిగిస్తూ, 50 శాతం రాయితీపై పోషకాలతో కూడిన పశువుల దాణా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెల్లరేషన్‌కార్డు కలిగిన రైతులు, పశువుల పెంపకందారులకు అందించనుంది. రూ.1100 విలువ కలిగిన 50 కిలోల దాణా బస్తాను రూ.555కే పంపిణీ చేయనుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో కోత..

గత వైసీపీ ప్రభుత్వంలో పశు పథకాలకు భారీగా కోత పడింది. దాణాపై సబ్సిడీని రద్దు చేసింది. దీంతో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రైతులకు నెలకొనేది. ఫలితంగా అప్పట్లో పశుపోషణ భారమైంది. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై రూ.555కే సమీకృత దాణా అందించేందుకు నిర్ణయించింది. ఈ రాయితీవల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పడినప్పటికీ, వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు, పాల దిగుబడి తగ్గకుండా చూసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని పశు సంవర్ధకశాఖాధికారులు చెబుతున్నారు. ఒక్కొక్క కుటుంబానికి గరిష్ఠంగా రెండు పెద్ద పశువులు, ఒక దూడకు 90 రోజులకు గాను 450 కిలోల దాణాను పంపిణీ చేయనుంది. జిల్లాలో 5వేల మంది రైతులు ఉన్నారు. మొత్తం 500 మెట్రిక్ టన్నుల దాణాను అందించనున్నారు. తొలి విడతగా 250 మెట్రిక్ టన్నుల దాణా వచ్చింది.

అర్హతలు ఇవే..

● రైతుల పేర్లు భారత్, పశుధన్ యాప్‌లో నమోదై ఉండాలి. పశువులకు టీకాలు వేసి ఉండాలి. ● తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలి. ● రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసి ఉండాలి. ● ప్రారంభంలో ఒక రైతుకి ఒక బ్యాగును అందజేస్తారు. ● దగ్గరలోని పశు వైద్యాధికారికి సంప్రదించవచ్చును. ● ఎస్సీ, ఎస్టీ నిష్పత్తి ఆధారంగా పశువుల దాణా కేటాయింపులు ఉంటాయి.

సద్వినియోగం చేసుకోవాలి..

ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న సమీకృత దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాకు 500 మెట్రిక్ టన్నుల దాణా అందనుంది. తొలి విడతగా 250 మెట్రిక్ టన్నులు చేరింది. ఒక్కో రైతుకి 150 కిలోల లెక్కన 90 రోజులు విడతల వారీగా 450 కిలోలు అందిస్తాం. రైతులు రూ.555 చెల్లిస్తే చాలు. వివరాలకు రైతు సేవా కేంద్రంలో కానీ, పశువైద్యాధికారిని కానీ సంప్రదించవచ్చును.

-వైవీ రమణ, జాయింట్ డైరక్టర్, పశు సంవర్ధకశాఖ, విజయనగరం

మ్యారేజ్ సర్టిఫికెట్ ఇవ్వట్లే!

- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న నూతన దంపతులు
- పట్టించుకోని ఉద్యోగులు
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆశ్రయిస్తున్న వైనం
- ఇక్కడ అధిక మొత్తంలో వసూలు



గజపతినగరం, మే10 (ఆంధ్రజ్యోతి): కొత్త దంపతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి. దీంతో ఆ సర్టిఫికెట్‌ను పొందేందుకు వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెళ్లి చేసుకున్న 21 రోజుల్లో మ్యారేజ్ సర్టిఫికెట్ పొందాలన్న నిబంధనను గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. గ్రామ సచివాలయాల్లో మ్యారేజ్ సర్టిఫికెట్ ఇచ్చే విధంగా రూపకల్పన చేసింది. అయితే, సచివాలయ ఉద్యోగులు పలు పర్యాయాలు తిప్పుతుండడంతో చేసేదిలేక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిబంధనల్లో మార్పులు చేసింది. పెళ్లయిన 60 రోజుల్లోపు సమీప సచివాలయాల్లో మ్యారేజ్ సర్టిఫికెట్ ఇచ్చేవిధంగా చర్యలు చేపట్టింది. అయితే, గత వైసీపీ ప్రభుత్వ వాసనలు సచివాలయ సిబ్బందిని వదలకపోవడంతో వధూవరులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కల్యాణ మస్తు పథకం కింద బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి పదో తరగతి చదువుకున్న వధువుకు రూ.50వేల నుంచి రూ.1.50లక్షల వరకు అందజేస్తుంది. అయితే, మ్యారేజ్ సర్టిఫికెట్ జారీలో ఆలస్యం జరుగుతుండడంతో వారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో అక్కడ సిబ్బంది అడిగినంత ఇచ్చి సర్టిఫికెట్ తెచ్చుకుంటున్నట్లు వారు వాపోతున్నారు. డాక్యుమెంట్ రైటర్లు రూ.2500 నుంచి రూ.3వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారు. పెళ్లికార్డు, పెళ్లి ఫొటోలు, చదువులేకపోయినా అన్నీ తాము చూసుకుంటామని చెప్పి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది పెళ్లిళ్లు అధికం కావడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికంగా మ్యారేజ్ సర్టిఫికెట్ల తంతు నడుస్తుంది. ఇప్పటికైనా గ్రామ, వార్డు సచివాలయాల్లో మ్యారేజీ సర్టిఫికెట్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వధూవరులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిబంధనలు ఇవి..

వధూవరులు ఎక్కడ పెళ్లి చేసుకుంటే అక్కడి గ్రామ సచివాలయాలకు వెళ్లి మ్యారేజ్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. రెండు ఫొటోలు, వధువు మెడలో వరుడు తాళి కట్టిన ఫొటో, పెళ్లికార్డు, ఆధార్ కార్డుతో దరఖాస్తు సమర్పించాలి. పెళ్లయిన 60 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇరువురి పెద్దలు సచివాలయంలో సాక్షి సంతకాలు పెట్టాలి. ఎటువంటి ఆటంకాలు లేకపోతే ఒక్క రోజులో ఉచితంగా మ్యారేజ్ సర్టిఫికెట్‌ను అందజేయాలి.

సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి..

గ్రామ సచివాలయాల్లో మ్యారేజ్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. పెళ్లికి సంబంధించిన ఫొటోలు, ఆధార్ కార్డు, సాక్షుల సంతకాలు ఉంటే ఒక్క రోజులోనే సర్టిఫికెట్ అందజేస్తారు. దళారులను నమ్మి మోసపోవద్దు. నేరుగా సచివాలయ ఉద్యోగులను సంప్రదించాలి. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా సర్టిఫికెట్ పొందవచ్చు.

-బి.కల్యాణి, ఎంపీడీవో, గజపతినగరం

శ్యామలాంబ పండగను వైభవంగా నిర్వహించాలి

- మంత్రి సంధ్యారాణి



ఉత్సవ కమిటీతో చర్చిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): సాలూరులో ఈనెల 18, 19, 20 తేదీలలో జరుపుకోబోయే సాలూరు గ్రామ దేవత శ్యామలాంబ అమ్మవారి పండగను అంగరంగ వైభవంగా నిర్వహించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఆమె శనివారం సాలూరులోని తన నివాసంలో ఉత్సవ కమిటీ, పట్టణ ప్రముఖులతో పాటు అనువంశిక ధర్మకర్త పాలూరి యువరాజు విక్రమచంద్ర సన్యాసి రాజు ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె పండుగ నిర్వహించబోయే తీరును పెద్దలను అడిగి తెలుసుకున్నారు. పట్టణమంతా విద్యుత్ దీపాలంకరణలతోపాటు మ్యూజికల్‌నైట్, పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పండగలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. పండగ విజయవంతానికి అన్ని శాఖ అధికారులు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావు, మండలి ఈశ్వరరావు, ఇంపుపూరి నారాయణరావు, సిగడాపు బంగారయ్య, కూనిశెట్టి భీమారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

టీడీపీ బలోపేతానికి కృషి

- యువకులు, సీనియర్లను సమన్వయం చేస్తూ ముందుకు
- పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి శ్రీనివాస్

బొబ్బిలి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, బేబీనాయన అన్నారు. బొబ్బిలి కోటలో శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఆధ్వర్యంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి యువకులు ఎంత అవసరమో, సీనియర్లు కూడా అంతే అవసరమన్నారు. వీరిని సమన్వయం చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు సమర్థంగా అమలు చేస్తున్నారని అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంత్రి లోకేష్‌ను అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు అంగీకారం తెలిపారు. తొలుత దేశ రక్షణ కోసం వీరమరణం పొందిన రాష్ట్రానికి చెందిన జవాన్ మురళినాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

మోసాలకు పాల్పడితే ఫిర్యాదు చేయండి



తూనికలు, కొలతలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

విజయనగరం రింగురోడ్డు, మే 10 (ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల్లో మోసాలు జరిగితే వినియోగదారులు తూనికలు, కొలతలు (లీగల్ మెట్రాలజీ) అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆ శాఖ సహాయ నియంత్రణ అధికారి టీవీ రంగారెడ్డి తెలిపారు. ఈ నెల 20న ప్రపంచ తూనికలు, కొలతలు శాఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ శాఖ ఆధ్వర్యంలో వినియోగదారుల అవగాహన వారోత్సవాలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం రిలయన్స్ స్మార్ట్ బజార్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ.. తూనికలు, కొలతల శాఖలో జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 20 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ రైతుబజారు ఎస్టేట్ అధికారి అప్పలనా యుడు, ఆ శాఖ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తనిఖీలు

- అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైం, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో పోలీసులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల్లో, ముఖ్యకూడళ్లలో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. లాడ్జిలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల వేలి ముద్రలు చెక్ చేసి గుర్తింపు కార్డులను పరిశీలించారు. 1,088 వాహనాల రికార్డులు పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పది వాహనాలను సీజ్ చేశారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, పోలీసులకు సహకరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు.

చీటింగ్ కేసు నమోదు

సీతంపేట రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రలకు తీసుకువెళ్తానని చెప్పి ఫోన్‌పే ద్వారా నగదు తీసుకున్న ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రామానికి చెందిన ఆర్.చిరంజీవిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం చీటింగ్ కేసు నమోదయ్యింది. ఈ కేసుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సీతంపేట మం డలం రేగులగూడ కాలనీకి చెందిన రాజ్ కుమార్‌తో పాటు మరికొందరు గత ఏడాది తీర్థయాత్రలకు వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. ఇందుకుగాను ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రామానికి చెందిన ఆంజనేయ ట్రావెల్స్ యజమాని ఆర్.చిరంజీవితో మాట్లాడుకున్నారు. మాట్లాడుకున్న ప్రాప్తికి రూ.97వేలు సదరు ట్రావెల్స్ యజమాని చిరంజీవికి రాజ్‌కుమార్ తన ఫోన్ నుంచి ఫోన్‌పే ద్వారా నగదు చెల్లించాడు. అయితే ఏడాది గడుస్తున్నా చిరంజీవి స్పందించకపోవడం, ఫోన్ లిఫ్ట్ చేయక పోవడంతో శనివారం సీతంపేట పోలీస్‌స్టేషన్‌లో రాజ్‌కుమార్ ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్‌ఐ అమ్మనరావు కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గరివిడి, మే 10(ఆంధ్రజ్యోతి): గంజాయిని గరివిడి, చీపురుపల్లి ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఒడిశాకు చెందిన వ్యక్తిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ లోకేశ్వరరావు తెలిపారు. గరివిడిలో ఇందిరమ్మకాలనీకి సమీపంలోని మామిడి తోటలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి సదరు వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. అతడి నుంచి 1500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

జేఎన్‌టీయూలో ప్రొఫెసర్ ఆకస్మిక బదిలీ

విజయనగరం రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జేఎన్‌టీయూలో ఆకస్మికంగా ప్రొఫెసర్‌ను బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. ఎలక్ట్రానిక్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ బాబులును విజయనగరం నుంచి కాకినాడ జేఎన్‌టీయూకు బదిలీ చేశారు. ఆయనను ఆకస్మికంగా బదిలీ చేయడంతో పాటు జేఎన్‌టీయూలో కొద్ది రోజులు కిందట అవుట్ సోరింగ్ సిబ్బంది పదోన్నతుల్లో వివాదం నెలకొంది. ఇప్పటికే ఆచార్యులు, నాన్ టీచింగ్ సిబ్బంది కొరత నేపథ్యంలో ప్రొఫెసర్‌ను బదిలీ చేయడంతో ఆ ప్రభావం ఇంజనీరింగ్ విద్యార్థులపై పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రొఫెసర్ బదిలీ విషయంపై జేఎన్‌టీయూ వీసీ రాజ్యలక్ష్మి వద్ద ప్రస్తావించిగా ఎలక్ట్రానిక్ విభాగానికి చెందిన ప్రొఫెసర్‌ను కాకినాడ జేఎన్‌టీయూకు బదిలీ చేయడం జరిగిందని వెల్లడించారు.

శిక్షణ తరగతుల పరిశీలన



తరగతులను పరిశీలిస్తున్న సైంటిస్ట్

రాజాం, మే 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో జవహర్ బాలభవన్ విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను విశాఖకు చెందిన ఐసీఆర్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్ఎస్ రాజు శనివారం పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన శిక్షణను అందించి వారిని జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం బాలభవన్ డైరెక్టర్ సంకరి రమేశ్‌తో మాట్లాడి రాజాం బాలభవన్‌ను ప్రతిఒక్కరు గుర్తించే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్.పద్మజారాజు ఉన్నారు.

సారా నియంత్రణకు అవగాహన

విజయనగరం క్రైం, మే 10 (ఆంధ్రజ్యోతి): గంట్యాడ మండలంలో దిగువకొండపర్తి పంచాయతీ పరిధిలోని అడ్డతీగ, ముసలికండి గ్రామాల్లో శనివారం సారా నియంత్రణకు అవగాహన సదస్సులు నిర్వహించారు. విజయనగరం రూరల్ సీఐ ఎం.విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీతమ్మ, ఎస్‌ఐ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎర్రిబాబు, వీఆర్వో గణపతి, అటవీ శాఖాధికారి సత్యనారాయణ, హెచ్‌ఎం రామ్మోహనరావు, స్వయం సహాయక సంఘాల మహిళలు పైడితల్లి, గౌరవమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ రెండు గ్రామాల్లో సారా అమ్మకాలు, రవాణా అదుపులో ఉండటంతో సారా లేని గ్రామాలుగా ప్రకటించారు.

పీవీ రావుకు నివాళి

వేపాడ, మే 10 (ఆంధ్రజ్యోతి): వేపాడలో శనివారం మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు జయంతిని నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు మండల అధ్యక్షుడు దేబార్కి కిరణ్ మాట్లాడుతూ కుల వర్గీకరణకు వ్యతిరేకంగా పీవీ రావు అలుపెరగని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో బంగారయ్య, రవి, సుధాకర్, ఎర్నిబాబు, చైతన్య, నరేంద్ర, నాగిరెడ్డి, శ్రీను తదితరులున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు వైద్యులు

వేపాడ, మే 10 (ఆంధ్రజ్యోతి): వేపాడ పీహెచ్‌సీలో శనివారం ఇద్దరు వైద్యులు మల్లావేణు, నీరజ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు.

ఉత్సాహంగా నాటిక ప్రదర్శనలు

● గరివిడిలో రెండోరోజూ కొనసాగిన పోటీలు





పోటీలను ప్రారంభిస్తున్న నరసింహరాజు, కళాకారులను సత్కరిస్తున్న నారాయణమూర్తి

గరివిడి, మే 10 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని శ్రీరామ్ హైస్కూల్‌లో రెండోరోజు శనివారం రాత్రి ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. గరివిడి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటిక పోటీల్లో 2వ రోజు చిగురుమేఘం (గుంటూరు), రైతేరాజు (హైదరాబాద్ కళాంజలి), అనూహ్యం (పాలకొల్లు) నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జానపద సినిమాల హీరో నరసింహరాజు హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి రెండో రోజు నాటిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ ఇలాంటి నాటిక పోటీలు గరివిడివాసులు నిర్వహించడం అభినందనీయమన్నారు. మరో ముఖ్యఅతిథి పలు సినిమాల్లో నటించిన జయలలిత, యువహీరో రవితేజ తదితరులు మాట్లాడుతూ గరివిడి పట్టణం కళాకారులకు నిలయమని కొనియాడారు. నాటక పోటీలను చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, ఫేకర్ యాజమాన్య ప్రతినిధి ఎంఎస్ఎస్ శర్మ తదితరులు వీక్షించారు.

●గరివిడికి చెందిన కళాకారులను శుక్రవారం రాత్రి ప్రముఖ హీరో ఆర్.నారాయణమూర్తి చేతుల మీదుగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ గరివిడివాసులు రాష్ట్రం, జాతీయ స్థాయిలో నాటిక పోటీల్లో పాల్గొని పలుమార్లు విజేతలుగా నిలిచారన్నారు. అలాంటివారికి సన్మానం చేయడం తాము అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ప్రశంసించారు.

12న జాతీయ తైక్వాండో సెమినార్



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న గురాన అయ్యలు

విజయనగరం దాసన్నపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజీవ్ స్టేడియంలో ఈనెల 12 నుంచి 15 వరకూ మూడో జాతీయ సెమినార్ జరుగుతుందని తైక్వాండో అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. శనివారం నగరంలోని కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సెమినార్‌కు ఇరాన్ దేశానికి చెందిన అబ్బాస్ షేక్ ట్రైనర్ హాజరుకానున్నారన్నారు. 12న సాయంత్రం 4 గంటలకు సెమినార్ ప్రారంభం కానుందన్నారు. సెమినార్‌లో సౌత్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. ఈసందర్భంగా సెమినార్ ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు.

అన్నా క్యాంటీన్‌పై తప్పుడు ప్రచారం తగదు



మాట్లాడుతున్న సువ్వాడ రవిశేఖర్

నెల్లిమర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): మహోన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ వ్యవస్థను కించపరిచేలా బీజేపీ నాయకుడు ప్రసాద్ వ్యవహరించడం దారుణమని టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, కార్యదర్శి లెంక అప్పలనాయుడులతో కలిసి ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకుడు ప్రసాద్ అన్నా క్యాంటీన్‌పై విమర్శలు చేయడం అనాలోచితమన్నారు. పొత్తు ధర్మానికి విరుద్ధమన్నారు. ఇలాంటి నాయకుడి తీరును ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌వర్మ అభినందించడం విడ్డూరంగా ఉందన్నారు. సదరు మండల స్థాయి నాయకుడిపై పార్టీ అధిష్ఠానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే రాష్ట్రస్థాయి నాయకులకు ఫిర్యాదు చేస్తామన్నారు. వైసీపీ నుంచి బీజేపీలో చేరిన సదరు నాయకుడికి ఇంకా పాత వాసనలు పోలేదని రవిశేఖర్ అన్నారు. ఆరోపణలను నిరూపించేందుకు సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. సమావేశంలో పార్టీ నాయకులు బయిరెడ్డి నాగేశ్వరరావు, కల్యాణ్, రెడ్డి వేణు, పంచాది కిరణ్, కలిశెట్టి కన్నంనాయుడు, కాళ్ల రాజశేఖర్, మజ్జి ఆదినారాయణ, లక్ష్మణరావు, కింతాడ కళావతి ఉన్నారు.

బకాయిలు చెల్లించండి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

శృంగవరపుకోట, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగులకు బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. శనివారం శృంగవరపుకోట ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 11వ పీఆర్సీ సంబంధించి 24 నెలల ఎరియర్స్, డీఏలు, సరెండర్ లీవ్‌లు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ల్లో ఒక్క బకాయి కూడా చెల్లించలేదన్నారు. 12వ పీఆర్సీ అమలకు కమిషన్‌ను నియమించాలని కోరారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి కోరారు. ఖాళీగా ఉన్న కండక్టర్, డ్రైవర్ పోస్టుల నియామకం చేపట్టాలన్నారు. జిల్లా ఈయూ అధ్యక్షుడు కె.కృష్ణారావు, కార్యదర్శి రవికాంత్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.ఎస్.మూర్తి, స్థానిక డిపో అధ్యక్షులు కె.జి.నాయుడు, కార్యదర్శి కొల్లి కోటేశ్వరరావు తదితరులున్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

రాజాం రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 20న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకుడు రామ్మూర్తినాయుడు పిలుపునిచ్చారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌లకు లాభాలు చేకూర్చేందుకు బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

మోపాడ పీహెచ్‌సీలో మాక్‌డ్రిల్

డెంకాడ, మే 10(ఆంధ్రజ్యోతి): మోపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పోలీసులు, వైద్య సిబ్బంది సంయుక్తంగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. పాకిస్థాన్, భారత్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో ప్రజలు గాయపడితే ఎలా ఆసుపత్రికి తరలించాలి, వైద్య సిబ్బంది ఎలా చికిత్స అందిస్తారనే దానిపై మాక్ డ్రిల్ చేపట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శరణ్య, ఎంపీహెచ్ ఎస్.ఎస్.సూరిబాబు, హెడ్ కానిస్టేబుల్ రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంవో మజ్జి గణపతి, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.సూరిబాబు, హెచ్‌వీ రెహ్మత్ ఉన్నిసా, ల్యాబ్ టెక్నీషియన్ పార్వతి, ఝాన్సీలక్ష్మి, ఏఎన్‌ఎం ఎం.జయలక్ష్మి, రమణమ్మ, ఆశా కార్యకర్త ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలు ప్రారంభం



క్రీడాకారులతో మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, మే10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంటశ్రీరాంపురంలో బొర్ర పైడతల్లమ్మ పండగ సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను శనివారం సాయంత్రం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. పోటీల నిర్వాహకులను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సింహాద్రి అప్పన్న పండగ



పండగలో కర్రోతు బంగార్రాజు

డెంకాడ, మే 10(ఆంధ్రజ్యోతి): డెంకాడలో శనివారం సింహాద్రి అప్పన్న పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మూడురోజుల పాటు నిర్వహిస్తున్న పండగలో రెండోరోజు శనివారం రొంగలి, సభవరపు, కోయిన కుటుంబాలతో కలిసి సింహాద్రి అప్పన్నను నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు ప్రదీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడికి ఎమ్మెల్సీ పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ గాదె

మెరకముడిదాం, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామంలో కోదండరామాలయాన్ని శనివారం ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం గొప్పతనాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అల్తి రాంబాబు నివాసంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. సర్వీస్ రూల్స్, సీపీఎస్ రద్దుకు కృషి చేస్తామన్నారు. బదిలీల్లో ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మాజీ సర్పంచ్ కర్రోతు నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు రెడ్డి శ్రీరాములు, సింహాద్రి, విజయనగరం అర్బన్ ప్రెసిడెంట్ చిట్టి రామునాయుడు, అల్తి బుచ్చిబాబు, ఏపీయూఎస్ జిల్లా నాయకుడు ఎస్.రమణ పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలి



గజపతినగరంలో పూజలు చేస్తున్న నాయకులు

గజపతినగరం, మే10 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నియోజకవర్గ బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు వణుకుపుట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిదరి దుర్గాప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు భాస్కరరావు, ఏడుకొండలు, మండపాక భారతి, దోగ్గ దేముడు తదితరులు పాల్గొన్నారు.



పైడితల్లి ఆలయంలో బీజేపీ నాయకులు

●రాజాం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని బీజేపీ నాయకులు శనివారం పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. యుద్ధంలో భారత్ విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటగిరి నారాయణరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు జొన్నాడ రంజిత్, వేమకోటి గిరిబాబు, పీవీజీ కృష్ణంరాజు, గుడివాడ నాగరాజు, సిహెచ్.సత్యనారాయణ, సామంతుల రమణనాయుడు, ఎస్.పాపినాయుడు, సిహెచ్.అజయ్, జనసేన నాయుకుడు డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేపల వేట అడ్డగింత



చేపల వేటకు వచ్చిన వారిని అడ్డుకున్న వీఆర్వో, కార్యదర్శి

శృంగవరపుకోట రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ పరిధిలోని రొంగలివాని చెరువులో చేపలు పట్టడానికి వచ్చిన వ్యక్తులను పంచాయతీ కార్యదర్శి కానూరి అనీల్‌కుమార్, వీఆర్వో నాయుడు శనివారం అడ్డుకున్నారు. ఈవిషయంపై పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలోని రొంగలివాని చెరువులో కొందరు చేపలు పట్టడానికి వచ్చారనే స్థానికుల సమాచారం మేరకు వారిని వెనక్కి పంపించామన్నారు. ఈ చెరువుతో పాటు మరో మూడు ప్రభుత్వ చెరువులు కోర్టు వివాదంలో ఉన్నాయన్నారు. ఈ చెరువుల్లో చేపల పెంపకం చేపట్టి తద్వారా వేలం వేసి పంచాయతీ ఆదాయం పెంచుకోవాలని స్థానికులు భావించారు. అయితే ఇవి మంచినీటి చెరువులని వీటిలో చేపలు పెంచడం తగదని విశాఖకు చెందిన ఓ వ్యక్తి కోర్టులో కేసు వేశారన్నారు. ఈ విషయంపై చేపలు పట్టేందుకు వచ్చిన అప్పారావు మాట్లాడుతూ గడిచిన 15 ఏళ్లుగా ఈ చెరువుల్లో చేపలు పెంచుతున్నామన్నారు. గతేడాది పంచాయతీలో కొందరు వ్యక్తులకు రూ.40 వేలు ఇచ్చి చేపలు పట్టుకున్నానన్నారు. ఇదే విషయంపై ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యారావు మట్లాడుతూ ఈ చెరువుల్లో గడిచిన 15 ఏళ్లుగా చేపల పెంపకం జరుగుతోందన్నారు. ఈ ఏడాది చెరువుల్లో గ్రామస్థులకు పనులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అయితే ఈ చెరువులపై కోర్టు వివాదంలో ఉందని తెలుసుకుని పనులు చేపట్టలేదన్నారు.

ఏమైందో ఏమో..

● రైలు కిందపడి పెద్దపుర్లి యువకుడి మృతి

●ఆమదాలవలసలో ఘటన



సురేష్ (ఫైల్)

రేగిడి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్దపుర్లి గ్రామానికి చెందిన యువకుడు రేగిడి సురేష్ (26) ఆమదాలవలసలో రైలు కింద పడి శుక్రవారం రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. విశాఖలో ప్రైవేట్ జాబ్ చేస్తున్న సురేష్ శుక్రవారం ఒక వివాహ వేడుకకు హాజరయ్యేందుకు స్వగ్రామానికి వచ్చి ఆత్మహత్యకు పాల్పడటం గ్రామంలో చర్చనీయాంశమైంది. గ్రామస్థుల సమాచారం మేరకు పెద్దపుర్లి గ్రామానికి చెందిన రేగిడి జగన్నాథం, కాంతమ్మలకు ఇద్దరు పిల్లలు సంతానం. కుమార్తెకు వివాహమైంది. జగన్నాథం మూడేళ్ల కిందట మృతి చెందారు. కుమారుడు సురేష్ తల్లితో ఉంటున్నాడు. ఉద్యోగ రీత్యా విశాఖలో నివాసం ఉంటున్నాడు. స్నేహితుడి పెళ్లికి శుక్రవారం స్వగ్రామానికి వచ్చాడు. పెళ్లి వేడుకల్లో సాయంత్రం వరకు ఉన్నాడు. తెల్లారే సరికి ఆమదాలవలసలో రైలు కిందపడి విగతజీవిగా పడిఉన్నాడు. అంది వచ్చిన కొడుకు అనంత లోకాలకు వెళ్లిపోవటం తల్లి కాంతమ్మ, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సురేష్ మృతితో అతడి స్వగ్రామం పెద్దపుర్లిలో విషాదచాయలు అలుముకున్నాయి.

తల్లి మృతి చెందిందని..

● మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



దొరబాబు(ఫైల్)

గంట్యాడ, మే 10 (ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన తల్లి మృతి చెందడంతో మనస్తాపానికి గురై కుమారుడు ఆత్మహత్యకు చేసుకున్న ఘటన మండలంలోని కొండతామారాపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు అందించిన వివరాల మేరకు.. కొండతామారాపల్లికి చెందిన కోరాడ అప్పారావు, విక్టోరియారాణి దంపతులకు కుమార్తె రోషిణి, కుమారుడు దొరబాబు ఉన్నారు. పదేళ్ల కిందట అప్పారావు అనారోగ్యంతో మరణించారు. అప్పటి నుంచి ఆశాకార్యకర్తగా పనిచేస్తున్న తల్లి విక్టోరియారాణి ఇద్దరి పిల్లల ఆలనాపాలన చూస్తోంది. అయితే ఆమె ఆరు నెలల కిందట బాత్‌రూమ్‌లో జారిపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో ఇద్దరు పిల్లలు డెంకాడ మండలంలోని దొడ్డిబావాడలోని మేనమామ ఇంటిలో ఉంటున్నారు. ఈనెల 8న పెదమజ్జిపాలెం బ్యాంకులో వ్యవసాయ రుణం రెన్యువల్ చేయడానికి వారిద్దరినీ కొండతామారాపల్లి తీసుకువెళ్లారు. తన మేనమామ.. రోషిణిని తిరిగి స్వగ్రామానికి తీసుకుని వెళ్లారు. దొరబాబు(21) కొండతామారాపల్లిలో ఉండిపోయాడు. శుక్రవారం తల్లి సమాధి వద్దకు వెళ్లి రోదించాడు. రాత్రి తన ఇంటిలో ఉడ్ పాలిష్‌ను (టిన్నర్) శరీరంపై పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్‌ఐ సాయికృష్ణ కేసు నమోదు చేశారు.

బైక్‌ల చోరీ: ఇద్దరి అరెస్టు

● 9 మోటారు సైకిళ్లు స్వాధీనం



బైక్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నెల్లిమర్ల, మే 10(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలంలోని మొయిద విజయరాంపురంలో రెండు మోటార్ సైకిళ్ల చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 9 బైక్‌లను రికవరీ చేసినట్టు డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివారాలను వెల్లడించారు. మండలంలోని మొయిద విజయరామపురం గ్రామానికి చెందిన తాళ్లపూడి తాతారావు ఈనెల 2న ఇంటి ముందు నిలిపిన స్ప్లెండర్ బైక్ చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. అదే గ్రామానికి చెందిన పొట్టుపోగుల సంతోష్ ఈనెల 3న తన టీవీఎస్ ఎక్సెల్ జూట్‌మిల్లు సమీపంలో చోరీకి గురైందని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యాయ న్నారు. కేసుల దర్యాప్తులో భాగంగా శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఎస్‌ఐ బి.గణేష్, సిబ్బంది కలిసి చినబూరాడపేట సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా బెల్లాన చంద్రశేఖర్, దన్నాన సూరిబాబు మోటార్ సైకిల్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారన్నారు. వారు నెల్లిమర్ల మండలం పరిధిలోని 2 బైక్‌లు, గజపతినగరం మండలం పరిధిలో ఒకటి, విజయవాడ సిటీ పరిధిలో నాలుగు, గుర్ల మండలం పరిధిలో ఒకటి, కశింకోట మండల పరిధిలో ఒకటి.. వెరసి 9 బైక్‌లు దొంగిలించినట్టు అంగీకరించారన్నారు. దాంతో వారి నుంచి 9 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట భోగాపురం సీఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్‌ఐ బి.గణేష్, సిబ్బంది పాల్గొన్నారు. కేసులో నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన నెల్లిమర్ల ఎస్‌ఐ, సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జి.రామకృష్ణ అభినందించారు.

ఐదుగురిపై కేసు నమోదు

సంతకవిటి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాలాడ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు ఈనెల 3న రాత్రి వడ్డి వెంకటలక్ష్మి కుటుంబానికి, అదే గ్రామానికి చెందిన నేతల తవుడు కుటుంబానికి తగాదా జరిగిందన్నారు. మళ్లీ 5న తన కుమారుడితో నేతల తవుడు గొడవ పడటంతో వెంకటలక్ష్మి అక్కడకు వెళ్లిందన్నారు. దాంతో ఆమెను అసభ్య పదజాలంతో తవుడు దూషించి, అవమానపరచారన్నారు. గ్రామపెద్దల వద్ద సమస్య పరిష్కారం కాకపోవడంతో శనివారం వెంకటలక్ష్మి ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి



కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార సంస్థ ఆధ్వర్యంలో కురుపాంలో ఏర్పాటు చేసిన మహిళలు కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం ప్రారంభించారు. కురుపాం-2 పాఠశాలలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంతో బీసీ మహిళకు ప్రభుత్వం కుట్టుమిషన్ శిక్షణ ఇస్తుందన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ తో పాటు కుట్టుమిషన్ అందజేస్తారని తెలిపారు. ఈసందర్భంగా శిక్షణ ఇవ్వనున్న శ్రీటెక్నాలజీస్ కార్యక్రమ సమన్వయకర్త జి.రాజేష్ మాట్లాడుతూ ఈ శిక్షణ 90 రోజులు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు 96 మంది ఆన్‌లైన్ లో దరఖాస్తులు చేసుకున్నారని 120 మంది శిక్షణ పొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, మాజీ సర్పంచ్‌లు వెంపటాపు భారతి, ఆరిక విప్లవకుమార్, హిమరిక సుబ్బలక్ష్మి, మహిళలు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ప్రజాదర్బార్

గుమ్మలక్ష్మీపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో ఎమ్మెల్యేకు అందించారు. వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, విప్లవ్‌కుమార్ పాల్గొన్నారు.

నాయకమ్మగూడలో వైద్య శిబిరం

● ఆరు మలేరియా కేసులు గుర్తింపు



నాయకమ్మగూడలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

సీతంపేట రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొల్ల పంచాయతీ పరిధిలో గల నాయకమ్మగూడ గ్రామంలో దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో ఆరిక మోహిత్ అనే బాలుడు జ్వరంతో మృతిచెందిన నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి 129 మంది నుంచి రక్తపూతలు సేకరించారు. వీరిలో ఆరుగురికి మలేరియా పాజిటివ్ ఉన్నట్లు గుర్తించారు. పాజిటివ్ వచ్చిన వారికి వైద్యాధికారి భానుప్రతాప్ మందులను అందజేశారు. గ్రామంలో పంచాయతీ, సచివాలయ సిబ్బంది స్ప్రేయింగ్, క్లోరినేషన్ చేపట్టారు.

కొనసాగుతున్న స్ప్రేయింగ్

సీతంపేట రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా హైరిస్క్ గ్రామాలుగా గుర్తించిన గిరిజన గ్రామాల్లో ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ కొనసాగుతోంది. మొదటివిడతగా శనివారం దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలోని బూర్జగూడ గ్రామంలో మలేరియా సిబ్బంది స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ స్ప్రేయింగ్ ప్రక్రియను మలేరియా సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు పర్యవేక్షించారు. అనంతరం వంబరెల్లి పెద్దగూడ గ్రామాన్ని సందర్శించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కాచి వడబోసిన నీటిని తాగాలని గిరిజనులకు సూచించారు.

14 నుంచి కెరీర్ గైడెన్స్ శిక్షణ

గరుగుబిల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయంలో ఈనెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కెరీర్ గైడెన్స్ శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నారు. శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఉచిత శిక్షణలో విశ్రాంత ఐఏఎస్ అధికారి జె.మురళి ప్రధాన శిక్షకుడిగా వ్యవహరించనున్నారు. 15 నుంచి 35 ఏళ్లలోపు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు, విద్యార్థులకు పోటీ పరీక్షల్లో విజయం సాధించడం ఎలా, ఉన్నత చదువులపై అవగాహన, తదితర వాటిపై శిక్షణ అందించనున్నారు. అర్హత కలిగిన వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని మురళి తెలిపారు. మరిన్ని వివరాలకు జట్టు కార్యాలయం ప్రతినిధులు డి.నవజీవన్ 9177114333, డి.వాసుదేవరావు 8179012050 నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

జనసేనలో చేరిక

పాలకొండ/వీరఘట్టం మే 10 (ఆంధ్రజ్యోతి): పాలకొండ పట్టణంలోని పదో వార్డుకు చెందిన వైసీపీ వార్డు కౌన్సిలర్ కొంచాడ సరోజని, అరుణ్ దంపతులు శనివారం జనసేన పార్టీలోకి చేరారు. వీరికి ఎమ్మెల్యే జయకృష్ణ వీరఘట్టంలోని తన స్వగృహంలో పార్టీ కండువా వేసి ఆహ్వానం పలికారు. వారితో పాటు పదో వార్డుకు చెందిన సుమారు వంద కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ కార్య క్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ వాకమూడి అనీల్, ఎంపీటీసీ మజ్జి నవీన్, టీడీపీ నాయకుడు శ్రీధర్, నాలుగో వార్డు కౌన్సిలర్ కొరికాన గంగునాయుడు, ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, జిల్లా ప్రో గ్రామింగ్ కమిటీ సభ్యులు ప్రశాంత్, రమేష్, వీరఘట్టం నాయకులు మత్స్య పుండరీకం, సాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వీర సైనికుల కోసం ప్రత్యేక పూజలు

పాలకొండ, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం భారత వీరసైనికులు పోరాడుతున్న తరుణంలో దేశ ప్రజలందరూ వీరసైనికుల క్షేమాన్ని, విజయాన్ని కోరుతూ ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు శ్రీకాకుళంలోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించనున్నట్టు కూటమి నాయకులు తెలిపారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, ఆయా రాష్ట్ర కార్పొరేషన్ల గౌరవ డైరెక్టర్లు, పది అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

బొబ్బిలిలో ఉచిత వైద్య శిబిరం

బొబ్బిలి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని కళింగ వైశ్యభవనంలో శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత స్త్రీల వైద్య శిబిరం నిర్వహించారు. ప్రసూతి వైద్య నిపుణులు పి.రామ్‌కుమార్, శ్రావణిలు పాల్గొని, పలువురి స్త్రీలకు వైద్య పరీక్షలు, చికిత్సలు చేశారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందించారు. రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం రోటరీ ఫౌండేషన్ చైర్మన్ గెంబలి శ్రీనివాసరావు వైద్యులకు ఘనంగా సత్కరించారు.

నేడు రక్తదాన శిబిరం

బొబ్బిలి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో గల అవేర్ ఫౌండేషన్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 9గంటల 30 నిమిషాలకు రక్తదానం శిబిరం నిర్వహిస్తామని ఫౌండేషన్ అధినేత, జనసేన పార్టీ నాయకుడు పెద్దింటి మనోజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బేబీనాయన ప్రారంభిస్తారని ఆయన చెప్పారు.

ఇలా ఉంటే రోగాలు రావా?

● వీరఘట్టంలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
● రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు ● అవస్థలు పడుతున్న స్థానికులు



ఆర్అండ్‌బీ కాలనీలో రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు

వీరఘట్టం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో నుంచి వచ్చిన మురుగంతా ఇక్కడ రోడ్డుపైనే ప్రవహిస్తుంది. రోజుల తరబడి రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. ఇలా ఉంటే రోగాలు రావా.. అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదీ వీరఘట్టం మేజర్ పంచాయతీలో ఆర్అండ్‌బీ అతిథి గృహం సమీపంలోని కాలనీలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ దుస్థితి. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయ్యింది. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దోమలు విజృంభిస్తున్నాయి. ఎక్కడ రోగాల భారిన పడతామోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువల్లో పూడికలు తొలగించి, రోడ్డుపైకి మురుగు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ ఈవో బి.కోటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏరియా ఆసుపత్రి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో ఎమ్మెల్యే జయకృష్ణ పాల్గొని, మాట్లాడారు. పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రి అంటే రోగులకు ధైర్యం, నమ్మకం, భరోసా కలిగేలా సేవలందించాలన్నారు. ఆక్సిజన్ నిల్వలు ఉంచే ఏర్పాట్లుపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించేందుకు మరింత కృషి చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావుకు సూచించారు. నాణ్యమైన సంతృప్తికరమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో చెట్లు నాటి పచ్చదనం పెంపొందించాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన పరికరాలను ప్రభుత్వం నుంచి రప్పించడానికి లేఖ ద్వారా కోరుతామని తెలిపారు. బయట ఆసు పత్రిలో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఫిజీషియన్ మోహన్ బాబును వెనక్కి రప్పించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వైద్యుడు జె.రవీంద్రకుమార్, ఆసుపత్రి కమిటీ సభ్యులు జవరాజు, సువరన్న సరస్వతి, అడపా బాబ్జీ, పెనుగొండ రాజశేఖర్, ఎచ్చెర్ల జయరాం, మున్సిపల్ చైర్మన్ ఆకుల మల్లీశ్వరి, జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, వైస్ ఎంపీపీ వాకమూడి అనీల్, ఎంపీటీసీ మజ్జి నవీన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సీతంపేట రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): సీతంపేట గ్రామంలోని టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్ పంపిణీ

బొబ్బిలి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఉచిత మెటీరియల్ పంపిణీ చేశారు. అలాగే ప్రముఖ విద్యావేత్త, పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రాసిన మనోవిజ్ఞాన శాస్త్రం పుస్తకాలను 200 మంది అభ్యర్థులకు అందించారు. వాసు విద్యాసంస్థల అధినేత వాసుదేవరావు, రిసోర్స్ పెర్సన్‌లు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



జీపు జాతాను ప్రారంభిస్తున్న యూటీఎఫ్ నాయకురాలు విజయగౌరి

బొబ్బిలి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్ చట్టాలకు వ్యతిరేకంగా ఈనెల 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం బొబ్బిలిలోని స్థానిక చర్చి సెంటర్‌లో యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి ఆధ్వర్యంలో జీపు జాతాను ప్రారంభించారు. బైకు ర్యాలీ చేశారు. సీఐటీయూ, ఇఫ్టూ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రామభద్రపురం: లేబర్ కోడ్ చట్టాలకు వ్యతిరేకంగా ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జీపుజాతా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్, సంఘ నాయకుడు బలసా శ్రీనివాసరావు, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి, కార్మికులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌బాబు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మహేష్‌బాబు

గరుగుబిల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ సత్తా చూపాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కురుపాం నియోజకవర్గ పరిశీలకుడు ఆరేటి మహేష్‌బాబు అన్నారు. ఉల్లిభద్ర గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పార్టీ సంస్థాగత ఎన్నికలను నిబంధనల మేరకు నిర్వహిస్తారని చెప్పారు. సమర్థవంతంగా పనిచేసే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీ మండల శాఖకు సంబంధించి ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వర్గ విబేధాలకు ఆస్కారం లేకుండా సముచిత స్థానాలు కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా కమిటీల ఎంపిక

గరుగుబిల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మార్గదర్శకాలకు అనుగుణంగా కమిటీలను నియమిస్తామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కురుపాం నియోజకవర్గ పరిశీలకుడు ఎ.మహేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కురుపాం నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లో మండల కమిటీ నియామకాలకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యకర్తల పనితీరును పరిశీలించి నియామకం జరుగుతుందన్నారు. ఈనెల 11న జియ్యమ్మవలస, 12న కురుపాం, 14న కొమరాడ, 16న గుమ్మలక్ష్మీపురం మండలాల్లో మండల స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. నిబంధనలు దిక్కరించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు.

కాంట్రాక్టు కార్మికులపై వేధింపులు ఆపాలి



ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ కాంట్రాక్టు కార్మికులు

పార్వతీపురంటౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులపై అధికారులు వేధింపులు ఆపాలని సీఐటీయూ, ఆ కార్మిక సంఘ నాయకులు జీవీ రమణ, బీవీ రమణలతో పాటు తులసిరామ్‌లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద ప్రజా రవాణా ఒప్పందాన్ని డీఎం అమలు చేయాలని, ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని, ఇతర కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ డిపో మేనేజర్ దుర్గా కాంట్రాక్టు కార్మికుల పట్ల వ్యవహార శైలి విమర్శలకు తావిస్తుందన్నారు. కాంట్రాక్టు అంగీకారం ప్రకారం చట్టాలనుసారం జాతీయ పండుగల సమయంలో సెలవులు ఇవ్వకపోవడం నిబంధనలను, కార్మికులను హక్కులను కాలరాయడమేనని అన్నారు. అనంతరం డిపో మేనేజర్ దుర్గా, జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు తో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, చర్చలు జరిపారు. ఈఎస్ఐ సౌకర్యంతో పాటు జాతీయ పండుగల సమయంలో సెలవులు ఇచ్చే విధంగా ఉన్నాతాధికారుల తో మాట్లాడి న్యాయం చేస్తామని డిపో మేనేజర్ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మన్మధరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పార్వతీపురంటౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గాదేవి తెలిపారు. శనివారం స్థానిక డిపో కార్యాలయంలో డైల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలకు కేటాయించిన సీట్లులో పురుషులు కూర్చుంటున్నారని, మహిళలకు తగు ప్రాధాన్యత కల్పించాలని, పార్వతీపురం బంధం వారి వీధికి చెందిన హరి కోరారని చెప్పారు. రాత్రి వేళల్లో బస్సులను పాతబస్టాండ్ వరకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, కొమరాడ మండలానికి చెందిన సాంబమూర్తి కోరారని, అదే మండలంలోని లంజ గ్రామానికి, కల్లికోట గ్రామానికి బస్సులు నడపాలని, ఆయా గ్రామాల ప్రజలు కోరారన్నారు. గరుగుబిల్లి మండలం కొత్తపల్లితో పాటు పార్వతీపురం గౌరీపురం గ్రామానికి బస్సులను నడపాలని, ఆయా గ్రామాల పెద్దలు డైల్ యువర్ డీఎం కార్యక్రమంలో కోరినట్లు తెలిపారు. ప్రజల విన్నపం మేరకు త్వరలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని డీఎం తెలియజేసారు.

వీర జవాన్‌కు ఘన నివాళి



మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన తెలుగు బిడ్డ అగ్నివీర్ మురళీ నాయక్‌కు శనివారం స్థానిక కళింగ వైశ్య భవనంలో శ్రద్ధాంజలి అర్పించారు. బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షుడు సిందిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు, టీడీపీ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో బీజేపీ నాయకుల పూజలు

బొబ్బిలి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి పిలుపు మేరకు శనివారం బొబ్బిలిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆ పార్టీ నాయకులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ కార్యవర్గ సభ్యుడు పుల్లెల శ్రీనివాసరావు, పార్టీ కార్యకర్తలు పి.రాజశేఖర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లులకు పాదాభివందనం



తల్లులకు పాదాభివందనం చేస్తున్న అంగన్‌వాడీ చిన్నారులు

బొబ్బిలి రూరల్, మే 10 (ఆంధ్రజ్యో తి): పెంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మకు వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. చిన్నారులతో వారి తల్లుల కాళ్లను కడిగించి, పాదాభివందనం చేయించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

● మంత్రి సంధ్యారాణి



బాధితులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆమె శనివారం సాలూరులోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. సాలూరు పట్టణంలోని 19వ వార్డుకు చెందిన రాపాక సూర్యకుమారికి రూ.35,569, కోట వీధికి చెందిన తాలాడ సుభద్రమ్మకు రూ.65,931, సాలూరు మండలంలోని మావుడి గ్రామానికి చెందిన ఎలి నిహాల్‌కు రూ.లక్షా 3వేలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

జియ్యమ్మవలస, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల కన్వీనర్ పల్ల రాంబాబు తెలిపారు. టీడీపీ కురుపాం నియోజకవర్గ పరిశీలకుడు ఆరేటి మహేష్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశానికి కురపాం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఖేలో ఇండియా పోటీల్లో మణికంఠ ప్రతిభ



కాంస్య పతకంతో మణికంఠ

సీతంపేట రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రం రాజగిరిలో జరిగిన ఖేలో ఇండియా పోటీల్లో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో సీతంపేట మండలం జిల్లేడుపాడు గ్రామానికి చెందిన పాలక మణికంఠ ప్రతిభ కనబరిచాడు. మణికంఠ ఆంధ్రప్రదేశ్ టీంకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ పోటీల్లో ఏపీ టీం కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా మణికంఠకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పల్లా కొండలరావు, ప్రెసిడెంట్ కోడి సుదర్శనరావు, సెక్రటరీ వెన్నపు చంద్రరావు, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు శనివారం అభినందనలు తెలిపారు.

సారా స్వాధీనం

సీతంపేట రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): జొనగనాయుడుగూడ గ్రామంలో శనివారం నిర్వహించిన దాడుల్లో 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని సవర బాలరాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు పాలకొండ ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి వినియోగించే 2,560 లీటర్ల బెల్లంఊటలను ధ్వంసం చేశామని చెప్పారు. దాడి చేసే సమయంలో అక్కడి నుంచి సవర వెంకయ్య, బాలిమ్మ, రవికుమార్‌లు పరారయ్యారని సీఐ తెలిపారు. సారా తయారీకి నల్లబెల్లాన్ని సరఫరా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్‌టీఎఫ్ ఎస్ఐ హనుమాన్‌నాయక్, బీఎంపీపీ సీఐ పి.మురళీధర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

మక్కువ, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీదేవికాలనీ జంక్షన్ సమీపంలో ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో శనివారం ముమ్మరంగా వాహన తనిఖీలను నిర్వహించారు. ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలించారు. సరైన వాహన పత్రాలు లేని వారిపై అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐలు గోపి, నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.